క్లుప్తంగా

22న జీసీఎం సంఘం ఎన్నిక

సాలూరు: గిరిజన సహకార మార్కెటింగ్ సంఘం ఎన్నిక ఈ నెల 22న నిర్వహించనున్నట్లు సబ్‌డివిజినల్ కోఆపరేటివ్ అధికారి పద్మజ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని, 15న పరిశీలన, 16న ఉపసంహరణ, 22న ఎన్నిక ఉంటుందని తెలిపారు. ఈ సంఘాల్లో ఓటర్లు నామినేషన్ దాఖలు చేయడానికి అర్హులని పేర్కొన్నారు.

నిర్వహణ గ్రాంట్స్ మంజూరుపై హర్షం

పార్వతీపురంటౌన్: ఎంఈఓ కార్యాలయాల నిర్వహణ గ్రాంట్స్ మంజూరు చేసేందుకు సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించడం పట్ల ఎంఈఓ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. గత మూడేళ్లుగా ఎంఈఓ కార్యాలయాల నిర్వహణ నిధులు మంజూరు కాకపోవడంతో ఎంఈఓలు ఇబ్బందులు పడుతున్నారని, సోమవారం జరిగిన విద్యాశాఖ స్టేట్ వెబెక్స్ సమావేశంలో ఎంఈఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ఎస్పీడీకి విజ్ఞప్తి చేయగా, నిధులు మంజూరు చేసేందుకు ఎస్పీడీ హామీ ఇచ్చారన్నారు. గ్రాంట్స్ విషయంలో సానుకూలంగా స్పందించిన ఎస్పీడీకి ఎంఈఓ అసోసియేషన్ పక్షాన ధన్యవాదాలు తెలియచేస్తున్నామని రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం, ప్రధాన కార్యదర్శి బి.రవి నాయక్ పేర్కొన్నారు.

రావికోన వీఓఏను కొనసాగించాలి



నిరసన తెలుపుతున్న ఐద్వా, డ్వాక్రా సంఘం సభ్యులు

పార్వతీపురం/పార్వతీపురంటౌన్: రావికోన పంచాయతీ వీఓఏ ఎం.కన్యాకుమారిని కొనసాగించాలని, గ్రామ సంఘం సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసిన సీసీపై చర్యలు తీసుకోవాలని ఐద్వా నాయకులు వి.ఇందిర అన్నారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. రావికూన పంచాయతీలో పనిచేస్తున్న వీఓఏపై మానసికంగా, రాజకీయంగా ఇబ్బంది పెడుతున్నారన్నారు. గ్రూపు సభ్యుల సంతకాలు ఫోర్జరీ చేసి అన్యాయంగా ఆమెను విధుల నుంచి తొలగించారన్నారు. ఆమెను తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సీఐటీయూ నాయకులు వై.మన్మథరావు, తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి



గెద్దలుప్పిలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీనివాస్

సీతానగరం: ఆధునిక సాగు పద్ధతులు, తెగుళ్ల నివారణ, అధిక దిగుబడులు సాధించేందుకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, మిశ్రమ పంటల సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తవలస గెద్దలుప్పి, బగ్గందొరవలస, బళ్లకృష్ణాపురం గ్రామాల్లో ఏఓఎస్ అవినాష్ ఆధ్వర్యంలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. మిశ్రమ పంటల సాగుతో పంటలను ఆశించే తెగుళ్లను నివారించడంతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. పంట మార్పిడి విధానంతో నేలలో పోషకాలు సమతుల్యంగా ఉంటాయన్నారు. రైతులకు రబీలో కావాల్సిన అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. అనంతరం రైతులతో కలిసి అరటి, వరి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, పశుసంవర్ధక శాఖ సహాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు సత్కారం



బదిలీపై వెళ్లిన ప్రిన్సిపాల్ డీజీఎస్‌వీ త్రినాథ్‌ను సత్కరిస్తున్న విద్యార్థులు

సీతానగరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దీర్ఘకాలంగా అధ్యాపకులుగా, ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించి వీరఘట్టం కళాశాలకు బదిలీపై వెళ్లిన త్రినాథ్‌ను ప్రిన్సిపాల్ ఎల్.దాలినాయుడు, విద్యార్థులు, అధ్యాపకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత త్రినాథ్ మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, తల్లిదండ్రులకు, అధ్యాపకులు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు.

టీడీపీలో నామినేటెడ్ చిచ్చు

- నామినేటెడ్ పదవి కేటాయింపుతో భంజ్‌దేవ్ ఎమ్మెల్సీ ఆశలపై నీళ్లు
- ఎమ్మెల్సీ పదవి రాకుండా మంత్రి సంధ్యారాణి అడ్డుకుంటున్నారని ఆరోపణ
- భంజదేవ్ వర్గీయులపై వేటుకు సిద్ధమై వెనక్కి తగ్గిన మంత్రి!
- అడుగడుగునా అవమాన భారంతో రగిలిపోతున్న ఆర్పీ వర్గీయులు



సాలూరు: నియోజకవర్గ టీడీపీలో నామినేటెడ్ పదవుల కేటాయింపు అగ్నికి ఆజ్యం పోసినట్లు అయింది. రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల కేటాయింపులో భాగంగా రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్‌కు సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మెంబర్‌గా ప్రకటించడం జరిగింది. దీంతో భంజ్‌దేవ్ వర్గీయులంతా విస్మయానికి లోనయ్యారు. ఈ ప్రకటన వచ్చిన వెంటనే పలువురు టీడీపీ నాయకులు భంజ్‌దేవ్ వద్దకు వెళ్లారు. ఎన్నికల వేళ చంద్రబాబునాయుడు సమష్టిగా పనిచేయాలని, పార్టీ అభ్యర్థి సంధ్యారాణిని గెలిపిస్తే ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చిన విషయంపై భంజ్‌దేవ్ వద్ద ప్రస్తావించారు. ఆనాడు మీరు చెప్పారనే మేమంతా సంధ్యారాణి గెలుపు కోసం పనిచేశామని తెలిపారు. మీకు ఎమ్మెల్సీ పదవి వస్తుందని మేమంతా భావిస్తే, ఈ విధమైన ప్రాధాన్యం లేని నామినేటెడ్ పదవి ఇవ్వడం ఏంటని అసహనం వ్యక్తం చేశారు. సాలూరు నియోజకవర్గంలో వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యే అయిన పీడిక రాజన్నదొరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖా మంత్రి పదవి ఇచ్చారని తెలిపారు. టీడీపీ ఆవిర్భావం నుంచి ఉంటూ, ఇదే నియోజకవర్గంలో పార్టీ తరఫున వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారని, ఏ పార్టీలోకి వెళ్లకుండా టీడీపీకి విధేయుడుగా, చంద్రబాబును నమ్ముకుని ఉన్నారని, 2024 ఎన్నికల్లో సంధ్యారాణి గెలుపులోను కీలకపాత్ర పోషించారని చర్చించుకున్నారు. మీకు ఈ పదవి ఇవ్వడం ద్వారా ఎమ్మెల్సీ పదవి ఇస్తారో లేదో అని సందేహం కలుగుతోందని వాపోయారు.

అడ్డుపడుతోంది మంత్రి సంధ్యారాణేనా?

ఈ క్రమంలో భంజ్‌దేవ్ వర్గీయులు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భంజ్‌దేవ్‌కు ఎమ్మెల్సీ పదవి రాకుండా రాష్ట్ర స్థాయిలో తనకున్న పరిచయాల ద్వారా మంత్రి సంధ్యారాణి అడ్డుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భంజ్‌దేవ్‌కు ఎమ్మెల్సీ ఇస్తే నియోజకవర్గంలో రెండో పవర్ సెంటర్ ఏర్పడుతుందని, అందరూ భంజ్‌దేవ్ ఇంటికే క్యూ కడతారని పార్టీ అధిష్టానంతో ఆమె చెప్పినట్లు పలువురు టీడీపీ నాయకులు గుసగుసలాడుకుంటున్నారు.

ఓటెయ్యలేదు.. వేటేద్దాం..

రాజకీయంగా తొలి నుంచి తనకంటూ ఓ సొంత వర్గాన్ని ఏర్పాటు చేసుకునే పనిలో నిమగ్నమైన సంధ్యారాణి నేడు పార్టీ సీనియర్ నాయకుడు ఆర్పీ భంజ్‌దేవ్ వర్గీయులను తొక్కుతున్నారని ప్రచారం జరుగుతుంది. ఈ క్రమంలో ఇటీవల ఓ ఆసక్తికర పరిణామం జరిగిందని కొందరు తెలిపారు. దాని సారాంశం ఏంటంటే.. 2024 ఎన్నికల్లో కొందరు టీడీపీ నేతలు ప్రతిపక్ష పార్టీకి అనుకూలంగా పని చేసి తమకు వెన్నుపోటు పొడిచారని సంధ్యారాణి పేర్కొంటూ నియోజకవర్గంలో పలువురు టీడీపీ ముఖ్య నాయకులు పేర్లతో జాబితాను సిద్ధం చేశారు. వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయించేందుకు ఆమె సిద్ధమైయ్యారు. విషయం తెలుసుకున్న భంజ్‌దేవ్ ఆమెను వ్యతిరేకించారని చర్చ జోరుగా సాగుతోంది. ఎవరూ పని చేయకుంటే మీరు ఎలా గెలిచారని, భవిష్యత్‌లో మరలా ఎన్నికల్లో నిలబడే ఉద్దేశ్యం మీకు ఉంటే ప్రస్తుతం ఉన్నవారిని నిలుపుకుంటూ, మిగిలిన వారిని కలుపుకోవాల్సి ఉంటుందని హితవుపలికారు. అలా అయితే 2019 ఎన్నికల్లో మీరు నాకు వ్యతిరేకంగా పనిచేసారని ఆరోపణలు, పత్రికల్లో కథనాలు వచ్చిన విషయాలను భంజ్‌దేవ్ గుర్తుచేస్తూ, అయితే అప్పుడు నేను మిమ్మల్ని పార్టీ నుంచి సస్పెండ్ చేయించాలి కదా అని ప్రశ్నించినట్లు పలువురు టీడీపీ నాయకులు చర్చించుకుంటున్నారు. దీంతో ఆమె వెనుకకు తగ్గినట్లు మాట్లాడుకుంటున్నారు. కాగా మంత్రి, పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని భావించిన ఈ జాబితాలో ఉన్న నాయకులకు ప్రాధాన్యం తగ్గించి, సమాంతరంగా తనకు అనుకూలంగా ఉన్న వేరే వ్యక్తులను ప్రోత్సహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే నేడు మంత్రిగా ఉన్న సంధ్యారాణికి మంత్రులు లోకేష్, నారాయణ వంటి ప్రముఖులతో సత్సంబంధాలు ఉన్న నేపథ్యంలో భంజ్‌దేవ్‌కు ఎమ్మెల్సీ రాకుండా సంధ్యారాణి అడ్డుకుంటున్నారని ప్రచారం జరుగుతోంది. ఏదేమైనా టీడీపీలో భంజ్‌దేవ్ వర్గీయులను సంధ్యారాణి అణగదొక్కడమే కాకుండా, వారిపై వేటు వేయడానికి సిద్ధమయ్యారనే ప్రచారంతో, సదరు టీడీపీ నేతలు లోలోపల రగిలిపోతున్నారు. పార్టీ కోసం కష్టపడిన తమకు న్యాయం చేయకపోగా, పార్టీకి పని చేయలేదని చెడ్డ పేరు ఆపాదించి తమను పార్టీ నుంచి సస్పెండ్ చేయించే దిశగా పావులు కదపడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో సదరు మంత్రి అన్ని వ్యవహారాలను నిశితంగా గమనిస్తూ, సమయం వచ్చినప్పుడు తడాఖా చూపిస్తామని తమ అనుయాయుల వద్ద అన్నట్లు ప్రచారం జరుగుతుంది.

ఇస్తారా.. ఇవ్వరా?

నామినేటెడ్ పదవుల కేటాయింపులో మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషించారని టీడీపీ నాయకులు చర్చించుకుంటున్నారు. అయితే భంజ్‌దేవ్‌కు నామినేటెడ్ పదవి కేటాయించడం ద్వారా ఆయనకు ఎమ్మెల్సీ ఇవ్వకుండా సంధ్యారాణి చెక్ పెట్టారా లేదా పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న తనకు, ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబునాయుడు ఎమ్మెల్సీ పదవి ఇస్తారా అనేది నేడు నియోజకవర్గంలో టీడీపీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది.

భంజ్‌దేవ్ వర్గీయులకు అడుగడుగునా అవమానాలు..

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది, ఇక మండలంలో, పట్టణంలో చక్రం తిప్పొచ్చని ఆశించిన కొందరు టీడీపీ నాయకుల ఆశలు అడియాసలయ్యాయి. భంజ్‌దేవ్ వర్గానికి చెందిన నాయకులకు కూటమి ప్రభుత్వంలో అడుగడుగునా అవమానాలే స్వాగతం పలుకుతున్నాయని చర్చ జోరుగా సాగుతుంది. గత టీడీపీ ప్రభుత్వంలో పాచిపెంట మండలాన్ని శాసించిన ఆ పార్టీ మండలాధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు, నేడు ఆయన పంచాయతీలోనే పార్టీలోని వ్యతిరేక వర్గంతో కుమ్ములాటలతో తలలు పట్టుకుంటున్న పరిస్థితే దీనికి ఉదాహరణ. సాలూరు మండలంలో తోణాంలో భంజ్‌దేవ్, సంధ్యారాణి వర్గీయుల మధ్య జరిగిన తగాదా పోలీస్ స్టేషన్ వరకు వెళ్లగా, మంత్రి సదరు భంజ్‌దేవ్ వర్గీయులని పిలిచి వారిపై అసహనం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతుంది.

మంత్రిగారూ.. హామీల అమలు ఎప్పుడు?

- గిరిజన సమస్యలను పరిష్కరించి మంత్రి సంధ్యారాణి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: సమస్య ఏదైనా చిటికెలో పరిష్కారం చూపుతున్నారని గొప్పగా ప్రచారం చేసుకుంటున్న గిరిజన సంక్షేమశాఖ, స్త్రీశిశు సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణికి గిరిజన సమస్యలు పట్టవా అని మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ గిరిజన సంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర ప్రశ్నించారు. పట్టణంలోని తన స్వగృహంలో మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. జీఓ నంబరు 3 పునరుద్ధరణ చేస్తామని, షెడ్యూల్ గ్రామాలను గుర్తిస్తామని ఎన్నికల ముందు, ఎన్నికల ప్రచార సమావేశాల్లో, అధికారంలోకి వచ్చిన తరువాత ఇటీవల ఆదివాసీ దినోత్సవంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు నారా లోకేష్, సంధ్యారాణి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీలను అమలుపై గిరిజన సంఘాలు, గిరిజనులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయన్నారు. తమవి షెడ్యూల్ గ్రామాలుగా గుర్తించాలని, గతంలో సాలూరు మండలంలో జగ్గదొరవలస గ్రామంలో వెయ్యిరోజులకు పైగా గిరిజనులు నిరసన దీక్షలు చేపట్టారని తెలిపారు. 1400పైగా గిరిజన గ్రామాలను షెడ్యూల్ గ్రామాలుగా గుర్తించి జీఓ 3 పునరుద్ధరించాలని వారంతా డిమాండ్ చేశారని గుర్తుచేశారు. నాడు గిరిజనులు వద్దకు సంధ్యారాణి, భంజ్‌దేవ్‌లు వెళ్లి మద్దతు పలికారని తెలిపారు. నేడు మంత్రిగా ఉన్న సంధ్యారాణి ఆ సమస్యల పరిష్కారం చేయాలని గిరిజనులు కోరుతున్నారని అన్నారు. గిరిజనుల సమస్యలను ఎప్పుడు పరిష్కరిస్తారో తెలపాలని గిరిజనులు, గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారన్నారు. నేను ఉద్యోగిగా ఉన్నప్పటి నుంచి నేటివరకు గిరిజనుల సమస్యల పరిష్కారానికి గిరిజన జేఏసీలు, గిరిజన సంఘాలు చేసే న్యాయ పోరాటాలకు తన సహాయ సహకారాలు అందిస్తున్నానని వివరించారు. గిరిజన సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేసేవారికి తన సంపూర్ణ మద్దతు, న్యాయపరంగా సహాయ సహకారాలు అందిస్తానని పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల గిరిజన జేఏసీ నాయకులకు పత్రికా ముఖంగా తెలియజేశారు. గిరిజనులకు ఇచ్చిన హామీలను అమలుచేసి టీడీపీ కూటమి ప్రభుత్వ నేతలు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు.

ఎత్తిపోతల నిర్వహణ బాధ్యత రైతు కమిటీలదే..

పార్వతీపురంటౌన్: ఎత్తిపోతల నిర్వహణ పూర్తి బాధ్యత రైతు కమిటీలదేనని శ్రీకాకుళం నీటి పారుదల సంస్థ కార్యనిర్వాహక ఇంజినీర్ కేవీవీ సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏపీఎస్‌ఐడీసీ నిర్మించిన ఎత్తిపోతల పథకం బాధ్యత, నిర్వహణను రైతులు, రైతు కమిటీలకు అప్పగించడం జరిగిందన్నారు. నీటి తీరువా వసూలు చేసి ఎత్తిపోతల పథకం నిర్వహణ సక్రమంగా చేయాలని ఆయన సూచించారు. మండ పంచాయతీలోని జక్కరగూడ, రాయిమానుగూడ గ్రామాల రైతులు సాగుచేస్తున్న పంటలకు ఎత్తిపోతల పథకం ద్వారా సకాలంలో నీటిని విడుదల చేయాలని సూచించారు. ఎత్తిపోతల పథకం నిర్వహణకు, రిపేర్లకు రైతు కమిటీలు 20 శాతం ఖర్చు భరించాలని, మిగిలిన మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు. సీతంపేట మండలంలోని ఎంగుపేట ఎత్తిపోతల పథకంనకు పంపులు, మోటార్లు, సర్వీసింగ్, ఇతర పనులకు సుమారు రూ.8 లక్షల మంజూరు చేయాలని ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించామని తెలిపారు.

భారీ వర్షం

పాలకొండ రూరల్: పాలకొండలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గడిచిన నాలుగైదు రోజులుగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు వర్షంతో వాతావరణం చల్లబడడంతో ఉపశమనం పొందారు. మరోవైపు రహదారులు వర్షం నీటితో నిండిపోయాయి. ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొద్ది గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడ్డారు.

విద్యార్థుల శ్రమదానం

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం శ్రమదానం చేశారు. ఈమేరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కళాశాల నుంచి విద్యార్థులు 'పరిసరాల పరిశుభ్రత పాటిద్దాం.. ఆరోగ్యాన్ని సంరక్షించుకుందాం' అంటూ నినాదాలు చేస్తూ ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న చెత్తా చెదారాలను తొలగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం, వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

బురద నీరు మాకొద్దు..



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు, పట్టణ నాయకులు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం పట్టణానికి తాగునీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని ఈ సమస్యను పరిష్కరించలేని ప్రభుత్వం ఒక ప్రభుత్వమేనని ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి విమర్శించారు. పార్వతీపురం పట్టణ మంచినీటి సమస్య పరిష్కారానికై అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్వతీపురం పట్టణంలో జనాభా పెరుగుతోందని, కానీ వారి అవసరాలకు తగ్గ సౌకర్యాలు, తాగునీరు సరఫరా మాత్రం మున్సిపాలిటీ, జిల్లా అధికారులు చేపట్టకపోవడం దారుణమని విమర్శించారు. ఇది ప్రజల పట్ల ప్రభుత్వ దారుణ నిర్లక్ష్యంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుతం వారానికి రెండు మూడు రోజులు నీటి సరఫరా చేస్తున్నారని, ఒక్కొక్కసారి పూర్తిగా రెండు వారాలకు ఒకసారి మాత్రమే అందిస్తుండడం, అది కూడా బురద నీరు అందివ్వడం అమానుషమని మండిపడ్డారు. పట్టణంలో కొత్తగా ఏర్పడిన కాలనీలకు పూర్తిగా పైపులైన్ కలెక్షన్లు లేవని, మరికొన్ని కాలనీలకు కలెక్షన్లు ఉన్న నీరు సక్రమంగా రావడం లేదని, పన్ను మాత్రం క్రమం తప్పకుండా మున్సిపాలిటీ అధికారులు పన్ను వసూలు చేయిపట్టడం దారుణమని వాపోయారు.

ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు..

రైతు సంఘం నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ పట్టణ ప్రజలు మంచి నీటి సమస్య వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బురద నీరు తాగుతుండడం వల్ల అనారోగ్య పాడిన పడుతున్నారని, అయినప్పటికీ ప్రభుత్వ, మున్సిపాలిటీ ఉన్నత అధికారులలో ఎటువంటి చలనం లేదన్నారు. మెట్రో ట్రైన్లు పట్టణానికి అందించడంలో ఉన్న శ్రద్ధ మంచినీటి అందించడంలో లేదని విమర్శించారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి పట్టణ ప్రజల తక్షణ అవసరమే గాక భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని తాగునీటిని సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వంద కోట్ల రూపాయలు కేటాయించాలన్నారు. తాగునీటి సరఫరా షెల్టర్‌ను ఆధునికరించాలని, ప్రతిరోజు శుద్ధి చేసిన నీటిని ప్రతి ఇంటికి ఇవ్వాలని, కొత్తగా వెలసిన కాలనీలకు అపార్ట్‌మెంట్లకు తాగునీటి కలెక్షన్ ఇవ్వాలలనారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిరా, జిల్లా నిర్వాసితుల సంఘం నాయకులు బంటు దాసు, సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ, సీఐటీయూ నాయకుడు బి.సూరిబాబు, పి.రాజశేఖర్, లక్ష్మీపతిరాజు, ఐద్వా పట్టణ కమిటీ నాయకులు జి.తులసి, ఎం.గౌరీ, కె.భవాని, జ్యోతి, జయ్యమ్మ, పి.ఉమా, రావనమ్మ, మంగ, లక్ష్మి పాల్గొన్నారు.

96.28 శాతం పింఛన్ల పంపిణీ



పింఛన్ల పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురంటౌన్: పట్టణం బెలగా, అగ్రహారం పేదలకు సేవలో భాగంగా మంగళవారం పింఛన్ల పంపిణీలో జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. జిల్లాలో 1,42,393 లక్షలు మందికి గాను 1,37,095 మందికి పంపిణీ చేసి 96.28 శాతం పూర్తి చేశామన్నారు. ఒక్క రోజులోనే శతశాతం పంపిణీకి చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు, మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పార్వతీపురంటౌన్: మండలంలోని నర్సిపురం గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుకుంటూ ముందుకు వెళుతుందన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వృద్ధాప్య, వితంతు పింఛన్లను రూ.3000 నుంచి రూ.4000కు వికలాంగ పింఛన్ రూ.3000 నుంచి రూ.6000కు పెంచుతామని ఇచ్చిన మాట తూచ తప్పకుండా అమలు చేసి ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకున్నారన్నారు. పేదలకు ఆర్థిక భరోసా ఉండాలను నిర్ణయంతో పింఛన్ల పెంపు చేసి అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సీతానగరం: విజేతలను అభినందిస్తున్న హెచ్‌ఎం మనోజ్‌కుమార్



మక్కువ: ద్వితీయ స్థానం సాధించిన శంబర విద్యార్థులు

మక్కువ: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం జన విజ్ఞానవేదిక రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. గత నెల 25న మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలకు చెందిన 580 మంది విద్యార్థులకు పాఠశాల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మక్కువ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన ఆర్.జ్యోత్స్న, కె.శిరీష, బి.కావ్య ప్రథమ స్థానం సాధించగా, శంబర జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సీహెచ్.చిరంజీవి, ఎస్.అనూష, జి.అక్షయ్ ద్వితీయ స్థానం సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈఓలు పి.సత్యానారయణ, పి.శ్యామ్‌సుందరరావు, హెచ్‌ఎం .హేమలత, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు రమేష్, రామారావు, రాంబాబు అభినందించారు. అలాగే పాఠశాల స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శాంతేశ్వరం పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు సిహెచ్.రామకృష్ణ తన భార్య సత్యవతి జ్ఞాపకార్థం విద్యార్థులకు బహుమతులు అందించారు.

సీతానగరం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పోటీల్లో నిడగల్లు ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. మండలంలోని ఏడు ఉన్నత పాఠశాలల నుంచి పలువురు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ఆర్‌కే జూనియర్ కళాశాల (పార్వతీపురం) కరస్పాండెంట్ పూడి రామకృష్ణ బహుమతులు అందజేశారు. అక్టోబరు 27న జిల్లాస్థాయి చెకుముకి పోటీలు జరుగుతాయి.

ఉచిత ఇసుక హామీ తక్షణం అమలు చేయాలి



కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ, భవన నిర్మాణ కార్మికులు

పార్వతీపురం/పార్వతీపురంటౌన్: ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని తక్షణం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు అన్నారు. ఈ మేరకు పార్వతీపురం కలెక్టరేట్ ఆధ్వర్యంలో నిరసన దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. వందరోజుల పాలనలో చూస్తే ఇసుక విషయంలో ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను మోసం చేసిందన్నారు. ఇసుక రీచ్‌లు జిల్లాకి 100 కిలో మీటర్ల దూరంలోని భామిని మండలం కాట్రగడ్డ నుంచి తేవాలి. రవాణా చార్జి విపరీతంగా పెరిగిపోతోందన్నారు. ప్రభుత్వమే ఉచిత హామీ అమలు చేయకపోవడం వలన ఇసుక లభించడం లేదన్నారు. రవాణా చార్జీలు, ఇతర పేర్లు చెప్పి ఇసుక రేటు భారీగా పెంచారన్నారు. జిల్లాలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కొనసాగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలు పలుచోట్ల ఇసుకపై పెత్తనం చేస్తున్నారని ఆరోపించారు.

ప్రభుత్వ ప్రకటనలకు పొంతనలేదు

ప్రభుత్వ ప్రకటనలకు, హామీలకు, ఆచరణకు పొంతనలేదు. ధరల్లో తీవ్ర వ్యత్యాసం కనబడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఉచితంగా ఇసుక లభించే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అందరికీ అందుబాటులోకి ఇసుక రీచ్‌లు తీసుకురావాలన్నారు. అవినీతిని అరికట్టాలని, భవన నిర్మాణ, ట్రాక్టర్ కార్మికులకు ఉపాధి చూపాలన్నారు. భవన నిర్మాణాలు చేసుకునే వారిపై అధిక భారం లేకుండా చూడాలని కోరుతూ అక్టోబర్ 4న జిల్లా కేంద్రం పార్వతీపురం కలెక్టరేట్ వద్ద, దీక్ష, ధర్నా, ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, సీఐటీయూ కోశాధికారి గొర్లి వెంకటరమణ, సూరిబాబు, గంది దిలీప్‌కుమార్, కిల్లాడ నాగేశ్వరరావు, అశోక్‌కుమార్, ప్రదీప్, శివ, చిరంజీవి, సత్తిబాబు, ప్రసాదు, జానీ, శంకర్ దాలియా, తదితర కార్మికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురం టౌన్: పట్టణంలోని 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ గోపాలరావు నాయుడు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సౌందర్య రోడ్, సౌందర్య థియేటర్ బ్యాక్‌సైడ్ కాలనీ, కృష్ణా కాలనీ, చర్చి వీధి, ఎల్ఐసీ ఆఫీస్, ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంతాలకు సరఫరా ఉండదని తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.